


## ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెప

### హర్ ఘర్ తిరంగా ర్యాలీని జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్



చిత్తూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త:
78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 9వ తేదీ నుండి 15వ తేదీ వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెప లాడాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం చిత్తూరు గాంధీ సర్కిల్ ఆవరణలో విద్యార్థులు, క్రీడాకారులు నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ సుమిత్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈ నెల 9 నుండి 15వ తేదీ వరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడాలన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం పాఠశాలలు, కళాశాలల్లో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజైన ఆగస్టు 15వ తేదీ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి జాతీయ పతాక ఆవిష్కరణ చేస్తారన్నారు. ఈ ర్యాలీ చిత్తూరు గాంధీ సర్కిల్ నుండి దర్గా సర్కిల్, ఎంఎస్‌ఆర్ సర్కిల్ మీదుగా పిసిఆర్ కళాశాల వరకు సాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి బాలాజీ, జిల్లా యూత్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్, ఇతర సంబంధిత అధికారులు, విద్యార్థిని విద్యార్థులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

### పంద్రాగస్టు వేడుకలకు పక్కా ఏర్పాట్లు



జిల్లా పోలీసు పెరేడ్ మైదానంలో గురువారం జరుగనున్న 78వ స్వాతం త్ర్య దినోత్సవ వేడుకలు పక్కాగా నిర్వ హించడానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో చేపట్టిన ఏర్పాట్లను మంగళవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎస్పీ మణికంఠ చందోలుతో కలిసి పరిశీలించారు.

## యువత దేశభక్తి భావన పెంపొందించుకోవాలి

### మున్సిపల్ కమిషనర్ ఎన్. మౌర్య, ఎస్పి సుబ్బరాయుడు



తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 13, ప్రభాతవార్త
హర్ ఘర్ తిరంగా వంటి కార్యక్రమాల ద్వారా యువతలో దేశ భక్తి భావన పెంపొందుతుందని, మన దేశంలో యువత దేశభక్తి భావన పెంపొందిం చుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎన్. మౌర్య, ఎస్పి సుబ్బరాయుడు అన్నారు. మంగళవారం స్థానిక మహతి ఆడి టోరియం నుండి ఎస్వియూనివర్శిటీ స్టేడియం వరకు టూరిజం, నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో తిరుపతి నగర పాలక కమిషనర్ నారపు రెడ్డి మౌర్య, తిరుపతి ఎస్పి సుబ్బ రాయుడు, సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు, ప్రాంతీయ సంచా టలకులు టూరిజం శాఖ అధికారి రమణ ప్రసాద్, జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్రనాత్ రెడ్డి, ప్రొఫెసర్ రజనీ, విద్యార్థిని విద్యార్థులు, ఎన్సిసి క్యాడెట్లు, సంబంధిత అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అసలైన హీరోలు శాస్త్రవేత్తలే

### ఇస్రోకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రోత్సాహం
### ఎన్‌డిఎ ప్రభుత్వంలోనూ ఇస్రోకు ఎంతో ప్రాధాన్యత
### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
### షార్‌లో జరిగిన నేషనల్ స్పేస్ డే విజయవంతం





శ్రీహరికోట (తడ), ఆగస్టు 13 ప్రభాతవార్త
అంతరిక్షంలోకి అలవోకగా ఉపగ్రహాలు పంపిస్తున్న శాస్త్రవేత్తలు అసలైన హీరోలని ఏపీ ఉప ముఖ్యమంత్రి కొణెదల పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మంగళవారం శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రంలో జరిగిన నేషనల్ స్పేస్ డే-2024 కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారతీయ సంప్రదాయాన్ని గౌరవిస్తూ సంస్కృతి శ్లోకంతో మొదలుపెట్టిన ఈ కార్యక్రమం మన దేశ శాస్త్ర సాంకేతిక రంగానికి మరింత గౌరవం తీసుకొచ్చిందన్నారు. శాస్త్రవేత్తలంటే తనకు చిన్ననాటి నుంచి అపారమైన గౌరవం ఉందని, ఇక్కడి శాస్త్రవేత్తలు విదేశీ మోజులో పడకుండా మన దేశ అభివృద్ధి, గౌరవం కోసమే పాటు పడుతున్నారని చెప్పారు. తమ జ్ఞానాన్ని భారతదేశానికి అందిస్తున్న శాస్త్రవేత్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తాను చిన్నప్పుడు షార్‌కు సమీపంలోని నెల్లూరులో చదువుకున్నానని, అయితే శ్రీహరికోటకు ఇప్పటిదాకా రాలేకపోయానని, ఒకసారి గేటు వరకు మాత్రమే వచ్చి వెళ్లిపోయానని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఆ రోజు కన్నకలలు నిజమయ్యాయని, శాస్త్ర సాంకేతిక శాఖ మాత్రమే కాకుండా పర్యావరణ శాఖ మంత్రిగా సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్‌లో పర్యటించినట్లు చెప్పారు. తన తల్లి శాస్త్రవేత్తలను ఎప్పుడూ గౌరవించేదని, కనిపించే దేవతలుగా కీర్తించేదని పవన్ కల్యాణ్ అన్నారు. సాయంత్రం పూట ఇంట్లో లైటు వేసి దండం పెట్టుకుంటే ఏ దేవుడికి పెడుతున్నావమ్మా.. అని అడిగానని విద్యుత్ లైటును కనుగొన్న థామస్ ఆల్వాఎడిసన్ పేరును ఆమె ప్రస్తావించడంతో ఆశ్చర్యపోయినట్లు తెలిపారు.

**రాష్ట్రప్రభుత్వంతో ఎంఓయు చేసుకుందాం**

రాష్ట్రంలోని యువత అభివృద్ధి కోసం ఇస్రో కూడా ఒప్పందం చేసుకుంటే భవిష్యత్ ప్రయోజనాలు ఉంటాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఎవరైనా భవిష్యత్ అభివృద్ధి కోసమే పని చేస్తున్నాం కాబట్టి యువతలో మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించి తద్వారా రూరల్, అర్బన్ ఏరియాలకు కూడా ఉపయోగపడేలా చేద్దామన్నారు. ఇటీవల జరిగిన పలు పోటీలలో విజేతలకు పవన్ కల్యాణ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ హమీద్, కంట్రోలర్ ఎం.శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ రఘురామ్, జనరల్ మేనేజర్ ఎస్.శంభుప్రసాద్‌లు మాట్లాడారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, గ్రూప్ డైరెక్టర్ పి.గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## భారీ జాతీయ జెండాతో ర్యాలీ

గూడూరు, ఆగస్టు 13, ప్రభాతవార్త



దేశ స్వాతంత్రం కోసం ఎందరో మహనీయులు ప్రాణాలు అర్పించారని నేటి యుతవ వారిని స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని ఉపాధ్యా యులు మన దేశ గొప్పతనాన్ని నిరంతరం తెలియ జేయాలని గూడూరు రైల్వే స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర రావు కోరారు. రాబోవు స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు పట్టణంలోని రైల్వే స్టేషన్ నుండి శ్రీ వివేకానంద కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో 75 అడుగుల జాతీయ జెండా ర్యాలీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్పిఎఫ్ సిఐ గురులాల్, మల్లికార్జున్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దండాలమ్మో నీకు గంగమ్మతల్లి..

### అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన బొజ్జల రిషితారెడ్డి





రేణిగుంట, ఆగస్టు 13 ప్రభాతవార్త:
అమ్మలు గన్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ, ఎంతో పెద్దమ్మ లోకాలనేలే పరమేశ్వరి, శ్రీశ్రీశ్రీ గంగమ్మతల్లి జాతర మహోత్సవంలో భాగంగా మంగళవారం భక్తులు అమ్మతల్లికి దేవాలయం వద్ద పొంగళ్లు పొంగించి అంబళ్లు సమర్పించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి అమ్మతల్లికి సాంప్రదాయబద్ధంగా పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆమెకు ఆలయ నిర్వాహకుడు గుడి చైర్మన్‌సోలా మల్లికార్జున్‌రెడ్డి, కమిటీ మెంబర్లు జ్యోతి నారాయణ, సదాశివరెడ్డి, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉదయం ఎమ్మెల్సీ డా. సిపాయి సుబ్రహ్మణ్యం, టీడీపీ సీనియర్‌నేత మబ్బుదేవ నారాయణరెడ్డి(పెద్దబ్బ) అమ్మతల్లిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వేకువ జామున పూజారులతో అమ్మవారిని మేల్కొలిపి సేవతో నిద్రలేపి వివిధ రకాల అభిషేకాలు చేయించారు. ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు.

## సేవాభావంతో భక్తులకు సేవలు

### -తిరుమల డిఎస్పీ విజయశేఖర్



తిరుమల, ఆగస్టు 13 ప్రభాతవార్తప్రతినిధి:
తిరుమలపవిత్ర పుణ్యక్షేత్రమని, ఇక్కడ పనిచేయడమంటే ఒక గొప్ప అదృష్టం కలిగి ఉండాలని తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్ అన్నారు. ముఖ్యంగా రోడ్డుపై విధులు నిర్వహించే పోలీసులు భక్తులకు మొదట కనిపిస్తారని, అలాంటి సమయంలో భక్తులతో సంయమనంగా, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. తిరుమల డిఎస్పీగా బాధ్యతలు చేపట్టిన విజయశేఖర్ తొలిసారిగా తిరుమలలోని 1టౌన్ సిఐ విజయకుమార్, 2టౌన్ సిఐ ఎ.సత్యనారాయణ, 1టౌన్ ఏఎస్‌ఐ చెంగయ్య, పోలీసుసిబ్బందితో సమీక్షసమావేశం నిర్వహించారు. రానున్న అక్టోబర్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయని, ఈ బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు బాధ్యతతో సేవలందించాలన్నారు. సమావేశంలో సిఐలు విజయకుమార్, సత్యనారాయణ, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు. తిరుమలలో ట్రాఫిక్ పార్కింగ్ ప్రాంతాలను గుర్తించారు.



# జవునిపల్లి సచివాలయానికి తాళం!

## -ప్రస్తుత పాలకులైనా న్యాయం చేయాలంటూ బాధితుడు డిమాండ్




వి.కోట,ఆగస్టు 13 ప్రభాతవార్త: వి.కోట మండలం జవునిపల్లి గ్రామ సచివాలయానికి భూ హక్కుదారులు తాళం వేసిన సంఘటన మంగవారం చోటుచేసుకుంది.బాధితుల కథనం మేరకు.... జవునిపల్లి గ్రామానికి చెందిన సోమశేఖర్ కుటుంబానికి ప్రభుత్వం దరఖాస్తు పట్టా మంజూరు చేసింది.గత వైకాపా పాలనలో సచివాలయ నిర్మాణం కోసం భూముల సేకరణకు అధికారులు పలు ప్రాంతాలు పరిశీలించారు.సచివాలయా నిర్మాణానికి అనువైన ప్రాంతం ఎక్కడా లేకపోవడంతో దళిత కుటుంబానికి చెందిన రైతు సోమశేఖర్‌ను వైకాపా నాయకులు రహదారి పక్కన ఉన్న భూమిలో సచివాలయం,రైతు భరోసా కేంద్రాలను నిర్మాణానికి భూమి ఇవ్వాలని అందుకు ప్రతిఫలంగా వి.కోట పట్టణం నందు ఇంటి స్థలం మంజూరు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది.బాధితులు అందుకు అంగీకరించి సుమారు 20 సెంట్లు భూమిని భవన నిర్మాణాలకు అప్పగించడం జరిగింది.బాధితులకు ఇందుకు ప్రతిఫలంగా పాపేపల్లి లేఅవుట్ నందు ఇంటి స్థలం ఇవ్వగా రూ.50 వేల ఖర్చు పెట్టి పునాదులు వేయడం జరిగింది.అయితే వారు చూపిన స్థలం మరో లబ్ధిదారుడికి పట్టా ఇవ్వడం జరిగిందని ఆ స్థలం తనదంటు తనకు కేటాయించినట్లు పట్టాతో లబ్ధిదారు ఆ స్థలం ఖాళీ చేయింది తాను నిర్మించిన పునాధిపై లబ్ధిదారుడు ఇల్లు నిర్మాణం చేపట్టారని తెలిపారు.ఈ విషయాన్ని అప్పటి వైకాపా నాయకులకు,జిల్లా కలెక్టర్,మండల తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లగా మరో ప్రాంతంలో రెండు ఇంటి స్థలాలు ఇస్తామని అధికారులు,నాయకులు నమ్మించి మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.తనుకు న్యాయం చేయాలని తన భూమిలో నిర్మించిన సచివాలయానికి తాళం వేసి ప్రస్తుత పాలకులైన తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

# దేవాలయ నిధులు వైకాపా నాయకులు స్వాహా

- ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ధ్వజం



శ్రీరంగరాజపురం, ఆగస్టు 13 ప్రభాతవార్త: ఆరిమాకులపల్లి గంగమ్మ దేవాలయ నిధులు వైకాపా నాయకులు స్వాహా చేశారని, దేవాలయ నిర్మాణ పనులు ప్రారంభించే మూడేళ్ళు పూర్తయినా నిధులు మాత్రం స్వాహా చేసిన నాయకులు నిర్మాణాన్ని మాత్రం పూర్తి చేయకుండా వదలివేశారని జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ధ్వజమెత్తారు. ఆరిమాకులపల్లి గంగమ్మ ఆలయ ఆవరణలో మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆలయ అభివృద్ధిపై గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముంగుంటకు చెందిన రిటైర్డ్ విఆర్ఓ హిమాచలపతిరెడ్డి మాట్లాడుతూ ఆలయ నిర్మాణం కోసం 48 లక్షల రూపాయలు ప్రభుత్వం విడుదల చేసిందని, అలాగే గత ఐదేళ్లుగా ఆలయానికి విరాళాలుగా వచ్చిన నిధులను అప్పటి జడ్పీటీసీ అప్పటి అధికార పార్టీ అండగా స్వాహా చేశారని ఆరోపించారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆలయానికి సంబంధించిన 18 గ్రామాల ప్రజలు కూర్చొని కూటమిలో వున్న పార్టీ నాయకులతో కలిసి బోర్డు ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం నుండి తాను నిధులు ఇప్పించడానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మురళీమోహన్, మండల పార్టీ అధ్యక్షుడు జయశంకర్‌నాయుడు, జిల్లా నాయకులు రాజశేఖర్‌నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు భాస్కర్‌నాయుడు, నాయకులు సుబ్రమణ్యంనాయుడు, సిద్దయ్యశెట్టి, చంద్రారెడ్డి, ధనంజయనాయుడు, చేకూరి బాలాజీనాయుడు, హేమాద్రియాదవ్, కుమార్, 18 గ్రామాల ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా స్విమ్స్‌లో ప్రపంచ అవయవదాన దినోత్సవం




తిరుపతి హెల్త్, ఆగస్టు 13 ప్రభాతవార్త : స్విమ్స్ లో మంగళవారం శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల లెక్చరర్ గ్యాలరీ నందు ప్రపంచ అవయవదాన దినోత్సవ కార్యక్రమం నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్విమ్స్ సంచాలకులు, ఉపకుల పతి డా. ఆర్వి కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఇన్చార్జి డా. ముక్తేశ్వరయ్య, యురాలజి విభాగాధిపతి డా.అనిల్ కుమార్, డా. అలోక్ సమంత్ దే, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా. నాగరాజు, మెడికల్ అంకాలజీ డా. భార్గవి పాల్గొని సంయుక్తంగా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్వి కుమార్ ప్రసంగిస్తూ ఉపనిషత్తులో పేర్కొన, ప్రకారం పరోపకారం ఇదం శరీరం అన్న సూక్తిని ప్రతి ఒక్కరు పాటించాలని, ఒక వ్యక్తి తన అవయవాలు దానం చేయడం ద్వారా ఎనిమిది మందిని బతికించగలరని, ముఖ్యంగా బ్రెయిన్ డెడ్ అయిన వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తే ప్రయోజనం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అవయవదానం రెండు రకాలుగా ఉంటుందని మొదటిది లైవ్ డొనేషన్ బతికి వున్న వారిలో ఒక కిడ్నీ, లివర్ను వైద్యుని పర్యవేక్షణలో అమర్చడం రెండవది కేడ్ వేర్ డొనేషన్ అనగా బ్రెయిన్ డెడ్ వారి కుటుంబ సభ్యుల అనుమతితో అవయవాలు సేకరించి, అవసరమున్న వారికి అమర్చడం ద్వారా ప్రాణాలను నిలిబెట్టవచ్చునని ఆయన తెలిపారు.ఈ ప్రక్రియ నిర్వహణలో తీసుకోవా ల్సిన జాగ్రత్తలను అసోసియేట్ ప్రొఫెసర్ డా. శ్రీ సత్యవతి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కళ్ళకు కట్టినట్టు వివరించారు. అలాగే లివర్ మార్పిడి శస్త్ర చికిత్సపై గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగాధిపతి డా. వెంకటరామిరెడ్డి, కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సపై అసిస్టెంట్ ప్రొ. మాధిని బోన్ మ్యారో మార్పిడిపై మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డా. భార్గవి పవర్ పాయింట్ ప్రజంటేషన్ సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీ పద్మావతి చిన్న పిల్లల హృదయాల డైరెక్టర్ డా. శ్రీనాథ్ రెడ్డి, స్విమ్స్ ఆర్ఎంఓ డా. కోటిరెడ్డి, డా. ప్రకాష్, డా. సునీల్, డా. హరికృష్ణ, డా. వర్ధవర్ధన్ వర్మ, డిప్యూటి డైరెక్టర్ ప్రభాపతి, డిప్యూటి రిజిస్ట్రార్ యర్రంరెడ్డి, పిఆర్ఓ వి. రాజశేఖర్, ఎంఎస్‌డబ్ల్యూ ప్రసాద్, సిబ్బంది, ఎంబిబిఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రధాని మోదీతో భారత దేశ ప్రాముఖ్యత ప్రపంచ ఖ్యాతి



శ్రీకాళహస్తి,ఆగస్టు 13 ప్రభాతవార్త : భారత దేశ ప్రధానిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టిన తరువాత ప్రపంచదేశాల్లో ప్రత్యేక గుర్తింపు వచ్చిందని యువ నాయకులు శాసనసభ్యుడు బొజ్జల సుధీర్ రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్ అన్నారు. మంగళవారం శ్రీకాళహస్తిలో 'హర్ ఘర్‌పే తిరంగా' కార్యక్రమాలపై అవగాహనకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, రాజకీయ నాయకులతో కలసి ర్యాలి నిర్వహించారు. ప్రధాని ఇచ్చిన పిలుపు శ్రీకాళహస్తి ప్రజలకు గుర్తుండిపోయేలా ఉండాలని యువ నాయకులు పిలుపు నిచ్చారు.శ్రీకాళహస్తి అభివృద్ధికి యువ నాయకులు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి శాసనసభ్యుని హోదాలో, రాష్ట్ర కార్యదర్శిగా కోలా ఆనంద్ కేంద్రం నుంచి సహాయ సహకారాలు సాధించాలని వక్తలు పిలుపు నిచ్చారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ సారధ్యంలో ఏర్పాటు చేసిన ర్యాలికి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరై జెండా ఊపి ర్యాలి ప్రారంభించారు.ఈ సందర్బంగా ఇద్దరుయువ నాయకులు మాట్లాడుతూ 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని హర్ ఘర్ తిరంగా అంటే ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేసి ప్రజల గుండెల్లో కల కాలం గుర్తుండి పోయేలా ఆచరించాలన్నారు.తమ ఇళ్ళపై జాతీయ జెండాను ఆవిష్కరించి సెల్ఫీలు దిగి ప్రచార మాద్యమాల్లో ప్రచారం చేయాలన్నారు. శ్రీకాళహస్తిలో ప్రధాని ఆదేశాలను తప్పక ఆచరింపజేస్తామని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధి దేశ చరిత్రలో నిలిచిపోయేలా అన్ని పార్టీలు అందరు నాయకులతో కలసి సమన్వయంగా పని చేస్తామన్నారు. కోలా ఆనంద్ మాట్లాడుతూ దేశ భక్తితో దేశం కోసం, ధర్మం కోసం అవిరళ కృషి చేస్తున్నా మన ప్రధాని దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ది పథంలలో నడిపిస్తున్నారని వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు.ఈ కార్యక్రమాల్లో యువ నాయకులతో పాటు మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్ బాబు, టిడిపి నేతలు రంగినేని చెంచయ్యనాయుడు, జి.విజయకుమార్ లక్కమనేని మధు, చాన్‌బాషా, బిజెపి నాయకులు మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, కంద్రిగ ఉమ, ఉమా సింగ్ అమర్‌నాథ్, గరికపాటి రమేష్‌బాబులతో పాటు బిజెపి,టిడిపి ద్వితీయశ్రేణి నాయకులు హాజరు కాగా ర్యాలి నాలుగు మాడా వీధుల్లో సాగింది.

## దోపిడీ ముఠా ఆట కట్టించిన రేణిగుంట అర్బన్ పోలీసులు

### -రెండు ద్విచక్రవాహనాలు, ఒక ఫోన్, 34 వేల నగదు స్వాధీనం

రేణిగుంట, ఆగస్టు 13 ప్రభాతవార్త: రేణిగుంట అర్బన్ పోలీసులు చాకచక్యంగా వలపన్ని సోమవారం ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు ద్విచక్రవాహనాలు, ఒక ఒప్పో ఫోన్, 34 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. అర్బన్ ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ వెంకటాద్రి పర్యవేక్షణలో సీఐ శరత్‌చంద్ర, ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి తమ సిబ్బందితో వీరిని రేణిగుంట జాతీయ రహదారి గురవరాజుపల్లె ఎయిర్‌పోర్టు క్రాస్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు విలేకరుల సమావేశంలో తెలిపారు. తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణానికి చెందిన షేక్ మీర్చావలి (19), గుమ్మిడాల మిదిలేష్ అలియాస్ బాబి(19), షేక్ షమీవుల్లా(19), గోనె విష్ణువర్ధన్ అలియాస్ దమ్ము(19), కంటి పల్లి మణికంఠ అలియాస్ మణి(19), చిత్తూరు ముని సంతోష్ అలియాస్ లల్లి(19)లు రేణిగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లెమడుగు రిజర్వాయర్ వద్ద ఆగస్టు నెల 8వ తేదీ కట్టబత్తిన రమేష్‌అనే వ్యక్తిని బెదిరించి, కొట్టి అతన్ని వద్ద ఉన్న ఒప్పో ఫోన్‌ను, ఫోన్‌పే ద్వారా 34 వేల రూపాయల డబ్బును వారికి సంబంధించిన అకౌంట్‌లో వేయించుకున్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు రేణిగుంటపోలీసులు కేసు నమోదు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో వీరిని రేణిగుంట మండలం గురవరాజుపల్లె ఎయిర్‌పోర్టు క్రాస్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. నేరం చేసిన సమయంలో వీరు ఉపయోగించిన రెండు ద్విచక్రవాహనాలతో పాటు, అపహరించిన సెల్‌ఫోన్ నగదును స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు.

## హర్‌ఘర్ తిరంగా 70 మీటర్ల జాతీయ జెండా ర్యాలీ



గంగాధర నెల్లూరు 13 ఆగష్టు ప్రభాతవార్త: భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాల మేరకు ఉమ్మడి ఎమ్మెల్యే వి.ఎం థామస్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే మీటర్ల పొడవైన జాతీయ జెండాతో బస్టాండు కూడలి వరకు భారీ ర్యాలీని నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులకు కిట్లను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు స్వామిదాస్ నాయకులు దేవసుందరం వెంకటేష్ ప్రకాష్ పురుషోత్తం నాయుడు ప్రకాష్ నాయుడుప్రభాకర్ నాయుడు మునిరాజులు యాదవ్ మురళి అశోక్ నాయుడు గోపి, గోపాల్ రెడ్డి ప్రసాద్ నాయుడు లతో పాటు పలువురు ఉపాధ్యాయని ఉపాధ్యాయులు విద్యార్థిని,విద్యార్థులు అధికారులు పాల్గొన్నారు.

## సదుంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



సదుం, ఆగస్టు 13 ప్రభాతవార్త : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సదుంలో వెలుగు ద్వారా మహిళా సంఘాలచే మంగళవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. సదుం పట్టణంలో జాతీయ జండా పట్టుకుని ర్యాలీ కొనసాగింది. అనంతరం బస్టాండులో మానవహారం ఏర్పాటు చేశారు. మహిళా సంఘాల ప్రతినిధులు, వెలుగు సీసీలు, ఏపీఎంలు, సంఘమిత్రలు పాల్గొని ప్రతిన చేశారు.

## ర్యాగింగ్‌కు పాల్పడే విద్యార్థులపై కఠిన చర్యలు : ఎస్పీ



చిత్తూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త: విద్యా సంస్థల్లో ర్యాగింగ్ అనేది ఒక తీవ్ర సమస్య. మెడికల్, ఇంజనీరింగ్ విద్యాసంస్థల్లో ఎక్కడైనా విద్యార్థులను ర్యాగింగ్ చేస్తే ర్యాగింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. అపోలో మెడికల్ కళాశాల కాలేజి కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం నిర్వహించిన యాంటి ర్యాగింగ్ కార్యక్రమానికి ఎస్పీ మణికంఠ చదోలు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ విద్యార్థులతో మాట్లాడుతూ ర్యాగింగ్‌కు అడ్డుకట్ట వేయడానికి మనదేశం ర్యాగింగ్ వ్యతిరేక చట్టాలు ప్రవేశపెట్టబడ్డాయన్నారు. దేశంలోని విద్యా సంస్థల్లో ర్యాగింగ్‌ను నిషేధించడం, నిర్మూలించడానికి 1997లో చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. ఈ చట్టం ప్రకారం ర్యాగింగ్ చేసిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఏ విద్యా సంస్థ వెలుపల, లోపల ర్యాగింగ్ నిషేధించబడిందన్నారు. ఈ కార్యక్రమంలో అపోలో కాలేజీ వైస్‌ఛాన్స్‌లర్ డాక్టర్ వినోద్‌భట్, కాలేజీ డీన్ డాక్టర్ అల్ఫ్రేడ్ ఆగస్టిన్, అపోలో కాలేజ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నరేష్‌రెడ్డి, రిజిస్ట్రార్ పోతరాజు, ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు, తాలుకా ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## హర్ ఘర్ తిరంగా ర్యాలీలో ఎమ్మెల్యే గురజాల

### - 500 అడుగుల జాతీయ జెండా ప్రదర్శన



చిత్తూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా ర్యాలీలో మంగళవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. సంతపేట నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం చేపట్టిన హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. అలాగే కొంగారెడ్డిపల్లి కరుమారియమ్మ గుడి నుండి గాంధీ విగ్రహం కూడలి వరకు విద్యార్థులు చేపట్టిన 500 అడుగుల జాతీయ పతాక జెండా ప్రదర్శన ర్యాలీలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పాల్గొన్నారు. విద్యార్థులతో ప్రదర్శనగా వచ్చిన ఎమ్మెల్యే గాంధీ విగ్రహంకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అములు, మాజీ ఎమ్మెల్యే సికె బాబు, డిప్యూటీ మేయర్ రాజేష్‌రెడ్డి, బిజెపి నాయకులు చిట్టిబాబు, జనసేన నాయకురాలు ఆరణి కవిత, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆలయ ఇన్‌చార్జి ఈఓగా వాణీ బాధ్యతలు స్వీకరణ



కాణిపాకం, ఆగస్టు 13 ప్రభాతవార్త: కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారిగా దేవస్థానం డిప్యూటీ ఈఓగా వున్న కె.వాణి మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. నూతన ఈఓగా బాధ్యతలు చేపట్టిన వాణిని ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు రవీంద్రబాబు, ధనుంజయ, సూపరెండెంట్ వాసు, దేవస్థానం స్థానాచార్యులు పణిస్వామి, ఉప ప్రధాన అర్చకులు శ్రీనివాస భట్టాచార్యులు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా ఆలయ ఈఓ నియామకంపై బుధవారం ఉదయానికి రాతపూర్వకంగా ఉత్వరులు వెలువడే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. దేవస్థానం రెగ్యులర్ ఈఓగా కర్నూలు డిప్యూటీ కమీషనర్‌గా పనిచేస్తున్న గురుప్రసాద్, లేదా మరో డిప్యూటీ కమీషనర్ సాగర్‌బాబులలో ఒకరిని నియమించే అవకాశాలు వున్నట్లు తెలుస్తోంది.

## వెస్ట్ సర్కిల్ కార్యాలయంను తనిఖీ చేసిన ఎస్పీ



చిత్తూరు, ఆగస్టు 13 ప్రభాతవార్త: చిత్తూరు వెస్ట్ పోలీస్ సర్కిల్ కార్యాలయంను మంగళవారం ఎస్పీ మణికంఠ చందోలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మణికంఠ చందోలు వెస్ట్ సర్కిల్ ఆఫీసు నిర్వహణ, సిబ్బంది పనితీరు, కీలకమైన కేసుల దర్యాప్తు, వివిధ క్రైమ్ రికార్డులను ఎస్పీ మణికంఠ చందోలు పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై పోలీసు అధికారులతో ఎస్పీ ఈ సందర్భంగా సమీక్షించారు. రోడ్డు భద్రత నియమాల ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఎస్పీ ఆదేశించారు. డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్‌నాయుడు, బదిలీ అయిన వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రవిశంకర్‌రెడ్డి, సర్కిల్ ఆఫీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులు నిందితురాలు అరెస్టు



పలమనేరు,ఆగస్టు 13 ప్రభాతవార్త: పలమనేరు పట్టణంలో ఆదివారం జరిగిన హత్య కేసులో నిందితురాలును మంగళవారం పలమనేరు పోలీసులు అరెస్టు చేశారు.ఈ సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ లక్ష్మీనగర్ కాలనిలో మొగిలీశ్వర్ (50), దేవరశెట్టి మంగమ్మ(49) 5సంవత్సరాలుగా సహజీవనం సాగిస్తున్నారని,ఈ క్రమంలో మొగిలీశ్వర్ గత కొంత కాలంగా మంగమ్మ అనుమానం పెంచుకుని తరచూ తనను కొట్టేవాడని ఆదివారం రాత్రి మొగిలీశ్వర్ వేదింపులు తట్టుకోలేక ఇంటిలోని చాకుతో మొగిలీశ్వర్‌ను మంగమ్మ పొడిచి చంపినట్లు విచారణలో తెలిసిందని తెలిపారు.ఈ మేరకు దేవరశెట్టి మంగమ్మను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడం జరిగిందని ఆయన తెలిపారు.

## అశ్వ వాహనంపై శ్రీ ద్రౌపదీదేవి





పుత్తూరురూరల్, ఆగస్టు 13 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవిసమేత శ్రీధర్మరాజుల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి, అమ్మవార్లు అశ్వవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం కార్వేటినగరం రోడ్డులోని మంచి నీళ్ళగుంట వద్ద గెరిగెను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లోఊరేగిస్తూ కార్వేటినగరం రోడ్డు, కాపువీధి మీదుగా ఆలయానికి చేరుకుంది. ఈ గెరిగెలోని జలాన్ని ఆలయంలోని ఉత్సవ మూల విగ్రహాలకు అభిషేకాలు చేశారు. అలాగే ఉత్సవ విగ్రహాలను పల్లకిసేవపై ఊరేగించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం కార్యక్రమం చేపట్టారు. రాత్రి భక్తిశ్రద్దలతో కల్యాణోత్సవం వైభవంగా స్వామి, అమ్మవార్లకు నిర్వహించారు. రాత్రి అశ్వ వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఏకాంతసేవ కార్యక్రమం నిర్వహించారు.

**వార్త ప్రభావం**

## కదిలిన వైద్య బృందం..

### జిల్లా వైద్యశాఖ దాడులు... పత్తాలేని డూప్లికేట్ డాక్టర్లు..ఆగ్రహించిన డిఐఓ

గంగవరం,ఆగస్టు 13 ప్రభాతవార్త : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల బృందం మండళవారం పలమనేరు నియోజకవర్గంలోని పలుచోట్ల ఆకస్మిక దాడులు నిర్వహించడంతో డూప్లికేట్ డాక్టర్లు పత్తాలేకుండా పోయారు.వివరాల్లోకి..పలమనేరు నియోజకవర్గంలోని పలమనేరు పట్టణం,గంగవరం,పెద్దపంజాణి,బైరెడ్డిపల్లె,వికోట మండలాలో 'వైద్యం ఏదైనా ఖరీదే..పరీక్షల పేరుతో నిలువు దోపిడీ.. ల్యాబ్ సెంటర్‌లలో కమీషన్ దారులు..మెడికల్ షాపుల్లోను పర్సంటేజీలు..చోద్యం చూస్తున్న వైద్యశాఖ ఉన్నతాధికారులు' అనే శీర్షిక సోమవారం వార్త దినపత్రికలో ప్రచురితమైన విషయం పాఠకులకు విధితమే.వెంటనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ స్పందించింది.జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్,జిల్లా వైద్యాధికారిణి ప్రభావతిదేవి ఆదేశాల మేరకు జిల్లా వ్యాధి నిరోదక అధికారి హనుమంతురావు,గవగవరం, పత్తికొండ వైద్యాధికారులు శ్రీనివాసులు,మల్లికార్జునరెడ్డిలతో పాటు తమ వైద్య బృందంతో కలిసి మంగళవారం మండలంలోని గంద్రాజుపల్లె పంచాయతీ నాలుగు రోడ్ల కూడలిలో ఆర్ఎంపీ వైద్యులు నిర్వహిస్తున్న వైద్యశాలలను ఆకస్మికంగా తనిఖీ చేయడానికి వెళ్ళారు.అయితే గ్రామీణ నకిలీ వైద్యులు వైద్యశాలను మూసివేసి పత్తాలేకుండా పోవడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇకపై తనిఖీలు ముమ్మరంగా ఉంటాయని ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ దాడుల్లో సూపర్‌వైజర్‌లు జ్యోతీశ్వర్,జయమ్మ తదితరులు పాల్గొన్నారు.






## నిర్లక్ష్యపు అధికారులపై చర్యలు

### - అధికారులకు షోకాస్ నోటీసులు

రేణిగుంట, ఆగస్టు 13 ప్రభాతవార్త: రేణిగుంట బీసీ హాస్టల్‌లో జరిగిన సంఘటనపై రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత సీరియస్ అయ్యారు. హాస్టల్‌లో 21 మంది విద్యార్థులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విషయం విదితమే. వీరంతా రుయా ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆరోగ్యం మెరుగైన తరువాత వీరిని డిశ్చార్జ్ చేశారు. విద్యార్థుల అస్వసథతకు కారకులైన వసతి గృహ అధికారులపై చర్యలు తీసుకోవాల్సిందిగా మంత్రి సవిత ఆదేశించారు. బయట ఆహారం తినడం వల్ల విద్యార్థులకు వాంతులు, విరేచనాలు అయినా సంఘటనను పై అధికారులకు తెలియజేయకపోవడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది క్షమించరాని నేరమని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఇలాంటి సంఘటనలు భవిష్యత్‌లో పునరావృతం కాకూడదని హాస్టల్ అధికారులకు, సిబ్బందికి స్పష్టం చేశారు. ఇలాంటి సంఘటనలు ఎక్కడైనా చోటు చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఇద్దరు అధికారులకు నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో వివరణ ఇవ్వాల్సిందిగా నోటీసుల్లో స్పష్టం చేశారు.

## అతలాకుతలంగా మారిన ఆర్‌అండ్‌బి రోడ్డు

పాకాల, ఆగస్టు 13 ప్రభాతవార్త : పాకాల పట్టణం నడిబొడ్డున నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉన్న రైల్వే స్టేషన్ ముందు, వారపు సంత సమీపంలో వున్న నీరు నిలిచి మడుగుల తయారవుతున్న పరిస్థితిని సర్వసాధారణమైపోయింది. నిత్యం ఇటువైపు వెళ్లే వాహనదారులు వర్షపు నీటితో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి పరిస్థితిని చక్కదిద్దవల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.





